# మీ జవాబు కోసం

లక్ష్మీభారతీ రెడ్డి

ప్రియమైన శ్రీవారికి,

మీ శ్రీమతి వ్రాయు లేఖ. ఉభయ కుశలోపరి. నేను గుర్తున్నాననే అనుకుంటున్నాను. గుర్తున్నానో లేదో మీరే గుర్తు తెచ్చుకుని రాయాలి. మీరు కువైట్ వెళ్ళి ఆరు సంవత్సరాలవుతోంది. ఎప్పటికప్పుడు వస్తున్నట్టు రాస్తున్నారే గాని వచ్చింది లేదు. సంపాదనలో పడి ఈ సంసారిని (నన్ను) మరిచారు. మరుపునకూ కొన్ని కారణాలుంటాయంటారు. కొత్తవి వస్తే పాతవి పారేస్తాం. మూల్న పడేస్తాం. మరచిపోతాం. ఇప్పుడు నేను పాతదాన్నయిపోయాగా మరి!

అసలు విషయం రాయడం మానేసి ఏదేదో రాసేస్తున్నాను. క్షంతవ్యురాలిని. కాకపోతే ఎలా మొదలుపెట్టి, ఎలా ముగించాలో తెలియని సందిగ్ధంలో కాస్త తడబాటు! అంతే! ఈ తడబాటూ మీ ఎడబాటు వల్ల వచ్చిందే. నిజం. అక్కడి నుంచి ఇక్కడికి వస్తున్న వారు కొందరు కొన్ని కొత్త కబుర్లను మీ గురించి మోసుకొస్తున్నారు. అయినవాళ్ళూ, కానివాళ్ళూ అందరూ అపహాస్యం చేస్తున్నారే గాని ఒక్కరూ ఓదార్పు మాటలు చెప్పేవారు లేరు. పైగా కొన్ని నెలల నుంచి మీ ఉత్తరాలూ రాకపోవడంతో ఏది నమ్మాలో, ఏది నమ్మకూడదోతెలియడంలేదు. విషయం విన్నప్పటి నుంచి మనసు ముక్కలై జీవితాన్ని ప్రశ్నిస్తోంది.

అక్కడ మీరెవరో ఓ అమ్మాయితో పరిచయం పెంచుకున్నారట! ఆ పరిచయం ప్రేమగా మారి పెనవేసుకుందటగా నీటిని పరోక్షంగా మీరు నిజం చేస్తున్నట్టుగా, చాలా కాలం నుంచి ఇంటి ఖర్చులకు డబ్బు పంపడమూ మానేశారు. మీరు పంపితే తినాలి. లేదా పస్తులుండాలి. ఇదీ ఇక్కడ నా పరిస్థితి. అసలు ఆడదాని జీవితం మొదట్నుంచీ మగవాడి దయా దాక్షిణ్యాల పైనే ఆధారపడి వుంటోంది. పుట్టడం, పెరగడం తండ్రి చేతుల్లో, పసుపుతాడు ప్రసాదం స్వీకరించాక భర్త మీదా, వయసుడిగి వృద్ధాప్యం వచ్చాక కొడుకు మీదా. ఇది బహుశా ఆడదాని దౌర్బల్యమేమో! పెళ్ళైన ఇన్నాళ్ళకు, ఇన్నేళ్ళకు మీకు మరో ఆడదాని అవసరం వచ్చిందా?

అడదానికి ఆడదే శత్రువన్న సామెత సామెతే. కాని అది నా జీవితంలో ఇలా నిజమవుతుందనుకోలేదు. మీ తొందరపాటు నిర్ణయం మా జీవితాల్ని నిర్దాక్షిణ్యంగా ఎలా చిన్నాభిన్నం చేస్తున్నదో, రెండ్రోజుల క్రితం జరిగిన సంఘటన చెబుతోంది. మన బాబు కృష్ణ మీకు గుర్తుండే వుంటాడనుకుంటా! ఒక వేళ గుర్తుండకపోయినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

ఎందుకంటే వాడిని కడుపులో వేసి వెళ్ళారు. భూమ్మీద పడి ఆరు సంవత్సరాలైనా మీరింత వరకూ రాలేదు. మీ నాన్నంటే 'ఇతనేరా!' అని మీ ఫొటో చూపించడమే తప్ప మనిషిని చూపించ లేకపోయాను.

వాడు ఇప్పుడు యు.కె.జి. చదువుకుంటున్నాడు. మొన్న స్కూల్ కెళితే రెండు నెలల నుంచి స్కూల్ మంత్లీ ఫీజు కట్టలేదని తిరిగి ఇంటికి పంపారు. పంపితే పంపారు గానీ విచక్షణా జ్ఞానం లేని టీచరు ఇలా అందట వాడితో.

'మీ నాన్న కువైట్ వెళ్ళి ఆరు సంవత్సరాలైంది. అక్కడో ముండ- మంచుకుని కులుకుతున్నాడట! ఆ కులుకులాడికి ఇంత డబ్బు పంపితే నేను చదువుకుంటానని లెటర్ రాయి' అందిట! నేను చాటలో బియ్యం వేసుకుని రాళ్ళేరుతున్నాను. కృష్ణ అమాంతంగా వచ్చి నా ఒళ్లో వాలిపోయి భోరుమని ఎక్కిళ్ళు పెట్టి ఏడ్చాడు. క్షణం నివ్వెరపోయాను.

"ఏమైంది కన్నా?" ఓదారుస్తూ అడిగాను.

జరిగింది చెప్పాడు.

"ఏడవకమ్మా! వాళ్ళంతా తెలివి తక్కువ వాళ్ళు. పూర్కొమ్మా! మా బాబు కదూ! ఏం కావాలి నీకు? బిస్కెట్లు, చాక్లెట్లు..ఏం కావాలో చెప్పు.." అంటూ ఆప్యాయంగా గుండెల కదుముకుంటూ అడిగాను. కన్నీళ్ళు వాడి కంటి నుంచి జలజలా రాలుతున్నాయి. వాడు వలవలా ఏడుస్తూనే అడిగాడు ఎదురుగా గోడకు తగిలించి వున్న మీ ఫొటో వంక వేలెత్తి చూపెడుతూ—

"నాన్న...నాన్న కావాలమ్మా!" అన్నాడు వాడు.

నా గుండెల్లో అగ్ని పర్వతం బద్దలైనట్టయింది.

ఏమని సమాధానం చెప్పను?

తేలేనిని అడిగితే ఎక్కణ్ణించి తెచ్చివ్వను? మళ్ళీ వాడు మామూలుగా నవ్వేందుకు ఒక రోజు పట్టింది. నా కాలి గజ్జెలమ్మి, వాడి స్కూల్ ఫీజు చెల్లించి బడికి పంపాను. పసి మనసుకు తగిలిన గాయం పెద్దయ్యాకైనా తగ్గదంటారు. ఏమౌతుందోనని భయంగా వుంది. ఇక్కడ నాకంటూ ఎవ్వరూ లేరు. ఉన్న మీరొక్కరూ దూరంగా వుంటూ, దూరమైపోతున్నారు.

ఇంతకూ మీరిక్కడుండగా నేను మీకేం తక్కువ చేశానని మీరీ తప్పటడుగు వేశారో అర్థం కావడం లేదు.

సుఖమా...? సంతోషమా...? ఎందులో...?

రోజంతా మీరు రుస రుసలాడినా రాత్రి పూట మీ గుస గుసల్లో అంతా మర్చిపోయేదాన్ని. నా తప్పేమిటో తెలియడం లేదండీ!

మనసు మీపైకి మళ్లినప్పుడు ప్రతి రాత్రీ శివరాత్రిలా గడిపిన రాత్రులెన్నో లెక్క రాయలేను.



విరహం నిప్పులా కాల్చేసిన నిశిరాత్రులు ఎన్నో గుర్తు లేదు. ఈ వయసు నిగ్రహం కోల్పోతుంటే శిలనయ్యానే కాని, ఏరోజూ హద్దులు దాట లేదు. జీవితం ఎందుకో ఆగిపోయినట్లనిపిస్తే, ఆశల ఊపునిచ్చి పూరడించారు.

ఒక తప్పు చేయాలంటే ఎంతో సేపు పట్టదు. ఎటొచ్చీ ఆ తప్పును ఒప్పుగా మలచి మార్చుకోవా లంటే మనిషికి ఓ జీవితకాలం పడుతుంది. అది కూడా ఒకొక్కరికి సరిపోదేమో..?!

అసలు తప్పంటే ఏమిటో తెలుసాండీ?

ఒకసారి వాటి బారిన పడ్డాక ఎప్పటికీ బెయిల్ దొరకని అరెస్ట్ వారెంటు. బయట పడేసరికి జారీ అయ్యే డెత్ వారెంటు. ప్రవేశించడమే తప్ప తిరిగి రావటం తెలీని పద్మ వ్యూహం. మనిషి విలువను నిలువునా మింగేసే తిమిం గలం. మీకో విషయం తెలిసున్నా, మళ్ళీ తెలియజేస్తున్నారు.

ఆడదాని జీవితం మగవాడి మీద ఆధార పడి వుంటుందన్నది నిజమే! కానీ..మగవాడి పరువూ- ప్రతిష్టా ఆడదాని మీదే ఆధారపడి వుంటాయన్నది, అంతకు మించిన నగ్నసత్యం.

మీరు మరో దాన్నుంచుకుని ఇంటికి తెచ్చు కున్నా, నేను మీతో కలసి కాపురం చేయగలను. నాకోసం కాకపోయినా బిడ్డల కోసం. మరి నేనొకడ్ని వుంచుకుని మీలాగా ఇంటికి తెచ్చు కుంటే...? అప్పుడు మీరు మీ కోసమైనా బ్రతకలేరు.

ఎందుకంటే లోకులు పలుగాకులన్నారు కదా! వారికి ఇరు పక్షాలకూ న్యాయం చేయడం తెలీదు. పక్షపాతులు.

మీరు తింటున్నది ఉప్పూ, కారమే...నేను తింటున్నదీ అదే! కోరికలు మీకే కాదు నాకూ వుంటాయి. అవి ఎప్పుడూ తమని తృప్తి పర్చమని కొరడా ఝుళిపిస్తూనే వుంటాయి. మీది శరీరం అయినప్పుడు, నాదీ శరీరమేగా?

మీరు చేస్తున్న పనే నేనూ చేస్తే?

ఈ ప్రశ్నకు మీకీ పాటికి తల తిరుగుతుం డాలి. అవును! తనదాకా వస్తేనే కదా ఏదైనా తెలిసొచ్చేది?

మీరు డబ్బు పంపకుంటే విస్తర్లు కుట్టో, పదిళ్ళలో పాచిపనులు చేసుకునైనా నన్నూ, నా బిడ్డనూ, వస్తే మరో బిడ్డనూ పోషించుకోగ లను. అదే భార్య హృదయ వైశాల్యమంటే!

డబ్బు సంపాదించమని నేనేమీ పోరలేదు. మీకు మీరుగా కువైట్ వెళ్ళారు. వెళ్ళాక, వెళ్ళిన ఉద్దేశానికి నీళ్ళొదిలి వేరే దారిలోకి వెళ్ళారు. ఆడదంటే 'క్షమయా ధరిత్రి' అన్నారు. కళ్ళు తెరిచి ఇప్పటికైనా మీరొస్తే తప్పు దిద్దుకున్న వారవుతారు. పెద్దల ప్రవర్తన పిల్లలకు శాపం కారాదు.

మీ తప్పు కృష్ణకు శిక్ష కాకూడదు. అందుకే మీ నిర్ణయం తెలుసుకున్నాక వాడిని తీసుకుని ఏ వూరైనా సరే వెళ్ళి ఎలాగోలా పరువు గానే బ్రతుకుతాను. చట్టబద్ధంగా కోర్టు ద్వారా రావ చ్చేమో గాని, మనసు, ఆత్మ, అంతరాత్మ సాక్షిగా విడాకులిస్తే మాత్రం మరణం వరకూ వేరుగానే వుండిపోవాల్సి వస్తుంది. ఈ ఉత్తరం మీలో చలనం తెచ్చి, మీరు మారితే ఫర్వాలేదు. సంతోషిస్తాను. లేదా కొన్ని జీవితాలంతేనని సరిపెట్టుకుంటాను.

మీరు మోహించిన మెరుగులన్నీ తరిగిపోయి నప్పుడు పశ్చాత్తాప పడీ ప్రయోజనం లేదు.

మీరు పోగొట్టుకున్న దేనిటో ఆలస్యంగా తెలుసుకున్నా, తప్పు నిప్పు అయ్యి జీవితాన్ని దహించి వేయక మానదు.

ప్రస్తుతానికి ఇంతే! ఆ తర్వాత ఎంతైనా జరగవచ్చు.

మీ సమాధానం కోసం ఎదురు చూస్తాను. ఆపై ఏం చేయాలో నిర్ణయించుకుంటాను.

-ఇట్లు

-ఇప్పటి వరకూ మీ భార్య హోదాలో

వుంటున్న -లక్ష్మి